23042025-MAI-04_Layout 1 4/23/2025 4:33 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com




## నమస్తే తెలంగాణ

# మారని బానిస భావాలు

బ్రిటిష్ వాడు రైళ్లు వేయడం వల్ల, విద్యావైద్య రంగాలను అభివృద్ధి చేయడం వల్ల భారతదేశం బాగుపడిందని మురిసిపోయేవారు కొందరు నాడూ ఉన్నారు, నేటికీ ఉన్నారు. కానీ, తెల్లదొరలు వచ్చింది మనలను బాగుచేయడానికి అనుకోవడం ఏమైనా బాగుంటుందా? భారతదేశ సంపదను వారు ఎంతెంత దోచుకుపోయారో లెక్కే లేదు. దోపిడీని వ్యవస్థీకృతం చేసేందుకు, సంపదను తరలించుకుపోయేందుకు చేసిన ఏర్పాట్లన్నింటినీ భారతదేశ భాగ్యవిధాతలని పొగడటం అవివేకం కాదా? అంతకన్నా బానిస మనస్తత్వం ఇంకొకటి ఉంటుందా? తెల్లోడు మనకు నాగరికత నేర్పాడంటే ఆమోదయోగ్యమవుతుందా? తెలంగాణ వ్యవసాయం గురించి కూడా ఈ గడ్డ మీద పుట్టిన కొందరికి ఈ తరహా భావాలే ఉండటం, అవి ఇప్పటికీ కొనసాగడం గురించి ఏమనుకోవాలి? అప్పుడెప్పుడో వందేండ్ల క్రితం నిజాంసాగర్ ఆనకట్ట కడితే ఆంధ్రావాళ్లు వచ్చి తెలంగాణ వాళ్లకు వ్యవసాయం ఎలా చేయాలో నేర్పారట. అంటే ఇక్కడ దండిగా నీళ్లున్నాయి కానీ సాగు తెలివిడి లేదని సెలవిస్తున్నారు ఘనత వహించిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సెటిలర్లు వచ్చారు. ప్రాజెక్టుల కింద భూములు కొన్నారు. ఎవుసం చేసుకొని బాగుపడ్డారు. అందరినీ ఆదరించి, అక్కున చేర్చుకునే తత్త్వం గల తెలంగాణ బిడ్డలు కూడా సెటిలర్లను కడుపులో పెట్టుకుని కాపాడారు. దీని మీద ఎవరికీ ఎలాంటి సందేహాలు, అభ్యంతరాలు లేవు. కానీ 'సాగు నేర్పడం' అంటే కచ్చితంగా బానిస బుద్ధే. పాతికేండ్ల కిందట ఓ నవలలో ఇలాంటి భావాలే రచయిత్రి వ్యక్తం చేసినప్పుడు పెద్ద దుమారమే చెలరేగడం ఈ సందర్భంగా గుర్తుకు రాకమానదు.

అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి రైతులను ఆగమాగం చేసినోళ్లు ఇప్పుడు రైతు ఆత్మగౌరవానికే ఎసరు తెస్తున్నారు తమ అతి తెలివితో. రైతు మహోత్సవం వేదికపై తెలంగాణ రైతుకు అవమానకరమైన రీతిలో వ్యాఖ్యలు చేయడం ఎలా అర్థం చేసుకోవాలి? ఎంతైనా తెలంగాణ సోయి లేని పార్టీకి పెద్ద కదా.. ఆ మాత్రం పొరుగు బానిసత్వం ఉండొచ్చునని సరిపెట్టుకోవాలా? ఆంధ్రాలో కాటన్ కట్టిన ఆనకట్టల తర్వాతే వ్యవసాయం బాగుపడిందన్న మాట నిజం. వాళ్లు ఆయనకు గుళ్లూ గోపురాలు కట్టి, విగ్రహాలు పెట్టి పూజిస్తారు. ఆయన కూడా బ్రిటిష్ ఖజానాకు పన్ను చెల్లింపులు మెరుగు పర్చడానికే ఆనకట్టలు కట్టారంటారు, అది వేరే విషయం. కానీ, ఈ గడ్డ మీద ఎప్పుడో శతాబ్దాల కిందట కాకతీయులు తవ్వించిన గొలుసుకట్టు చెరువుల కింద కొనసాగిన వ్యవసాయ వైభవం మాటేమిటి? మెతుకుసీమ నుంచి బర్మాలోని అరకాన్ దాకా ధాన్యం బస్తాలతో బండ్ల బారు ఎడతెరిపి లేకుండా సాగిపోయిన సంగతి పాపం ఆయనకు ఎవరైనా చెప్తే బాగుండేదేమో.

కాటన్‌కు పూర్వం ఆంధ్రావాళ్లు పనులు వెతుక్కుంటూ తెలంగాణ ప్రాంతానికి బతుకొచ్చిన సంగతి కూడా మరుగునపడిపోయింది. నిజమే, తెలంగాణలో కాలువల వ్యవసాయం తక్కువ, చెరువుల వ్యవసాయమే ఎక్కువ. అయితే, అవి మామూలు చెరువులు కావు. బొట్టు బొట్టు వాన నీరు ఒడిసిపట్టి, మెట్టు మెట్టుగా కట్టుకుంటూ పోయిన గొలుసుకట్టు చెరువులు. సాగు చరితలో అదొక చెరగని మైలురాయి. నీటి పారుదలలో సువర్ణాధ్యాయం. ఒక్క పాకాల కిందనే 15 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. 'పాకాల చెరువు కింద దున్నపోతు వెన్నిరిసినట్టు' వంటి సామెతలు ఇక్కడి వ్యవసాయం గొప్పదనాన్ని చాటుతాయి. ఈ గతవైభవ జ్ఞానం లేని పీసీసీ అధ్యక్షుడు ఇక్కడి ప్రజల స్వాభిమానాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. పొరుగువారి అంటకాగే లేదా వారి మోచేతి నీళ్లు తాగే గుణమున్న నేతలకు కాంగ్రెస్‌లో ఎప్పుడూ కొదువ లేదు. ప్రభుత్వ సారథే పొరుగు నేతలకు భజనలు చేస్తుంటే వారి పార్టీ నాయకుడు ఒకడుగు ముందుకువేసి అక్కడినుంచి వచ్చినోళ్లు మనకు సాగు నేర్పారంటూ బాకాలూదే స్థాయికి దిగజారిపోయారు. ఇది ఈ గడ్డ బిడ్డలకు ఏ మాత్రం మింగుడుపడే వ్యవహారం కాదు.

# తెలంగాణ రైతులపై ఎందుకింత కక్ష?

**తెలంగాణ రైతులపై కాంగ్రెస్, బీజేపీలకు ఎందుకింత కక్ష. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు వారి బతుకులను ఆగం చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలకు ఎనిమిదేసి సీట్లు ఇవ్వడమే రైతులు చేసిన తప్పా? రాష్ట్రంలో కాంగ్రెస్‌కు, కేంద్రంలో బీజేపీకి అధికార పీఠాన్ని అందించడమే వారు చేసిన పొరపాటా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో నిరుడు యాసంగిలో వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో 5 లక్షలకుపైగా ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి.**



కల్వకుంట్ల కవిత



కాళేశ్వరం ప్రాజెక్టుతో పనిలేకుండానే ఎస్సారెస్పీ స్టేజీ-1, స్టేజీ-2 ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పంటలు చేతికొచ్చే ముందు చేతులెత్తేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సీజన్ కాబట్టి అవగాహన లేకపోవచ్చునని అందరూ అనుకుంటున్నారు. కాళేశ్వరంలో ఏదో జరిగిపోయిందనే తప్పుడు ప్రచారంతో అందరు నిజమే అనుకున్నారు. రైతులు కూడా తమ నష్టాలను దిగమింగుకున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయం నుంచే కాంగ్రెస్, బీజేపీలు ఆ ప్రాజెక్టుపై అక్కసు వెళ్లగక్కుతూ ఉన్నాయి. 20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నేరుగా ఇంకో 18 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు నీళ్లిచ్చేలా ఆ ప్రాజెక్టును రూపొందించడమే తప్పయ్యింది. శరవేగంగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయడమే పొరపాటు అయ్యింది. 2020 నుంచి 2023 వరకు ప్రతి యాసంగి సీజన్‌లో లోయర్ మానేర్ డ్యాం దిగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజీ-1, స్టేజీ- 2 ఆయకట్టు 10 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీటి భరోసానిచ్చింది కాళేశ్వరం ప్రాజెక్టు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద యాసంగి పంట పండింది. 2019 నుంచి 2023 వరకు ప్రతి యాసంగి సీజన్‌లో (డిసెంబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు) కాకతీయ కాలువ నిండుకుండలా కదలాడిన సంగతి ప్రతి రైతుకు తెలుసు. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి రాకముందు వానకాలంలోనే వారబందీ (ఆన్ అండ్ ఆఫ్) పద్ధతిలో సాగునీటిని విడుదల చేసిన గడ్డు రోజులు కూడా రైతుల యాదిలో ఉన్నాయి. మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు మీదుగా ఎగసివచ్చిన కాళేశ్వర గంగ లోయర్ మానేరును దాటుకొని వందలాది కిలోమీటర్లు పరుగులు పెట్టింది. దాని ఫలితమే పుట్లకొద్దీ ధాన్యపు రాశులు.

2023, డిసెంబర్ 7న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకులో ఒక పియర్ (పిల్లర్) కుంగింది. ఆ పిల్లర్ కుంగగానే కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బ తీసేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి. ఘటన వెలుగుచూసిన 24 గంటల్లోనే నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) వాలిపోయింది. పడవల్లో బ్యారేజీని చూసిన ఎన్‌డీఎస్‌ఏ బృందం మధ్యంతర నివేదిక ఇచ్చేసింది. కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఉమ్మడి వ్యూహం ఫలించింది. మేడిగడ్డ నిర్మాణం లోపభూయిష్టమని, డిజైన్లు సరిగా లేవని, అనేక అక్రమాలు జరిగాయని చెప్తూ రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశించింది.

> **మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జ్యుడిషియల్ ఎంక్వైరీ సైతం కొనసాగుతున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బ్యారేజీలో పిల్లర్ కుంగుబాటుకు సరైన కారణాలు ఏమిటో కూడా తెలుసుకోకుండానే మధ్యంతర నివేదిక ఇచ్చిన ఎన్‌డీఎస్‌ఏ పూర్తి నివేదిక ఇవ్వడానికి తీవ్ర కాలయాపన చేసింది. ఎట్టకేలకు ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక అందజేసింది. కారణాలేమిటో తెలియదు కానీ, ఆ నివేదిక ఇంకా రాష్ట్రానికి చేరలేదు.**

మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న ఏడో బ్లాక్‌ను డైమండ్, కట్టింగ్ పద్ధతిన తొలగించి మళ్లీ నిర్మించాలని ఎన్‌డీఎస్‌ఏ సిఫారసు చేసినట్టుగా మీడియా కథనాలను బట్టి తెలిసింది. అంటే బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఆరోపించినట్టుగా మేడిగడ్డ బ్యారేజీ కొట్టుకుపోలేదు. మరమ్మతులు చేస్తే పూర్తికాలం సేవలందించడం ఖాయం. ఇప్పుడు ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డకు రిపేర్లు చేస్తే తమ ఆరోపణలన్నీ తప్పు అని జనం ముందు పలుచన అవుతామన్న భయం కాంగ్రెస్, బీజేపీ నేతలకు పట్టుకున్నది. అందుకే నివేదికను వెలుగు చూడనివ్వడం లేదు. ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆ నివేదికను పంపిస్తే జూన్‌లోగా బ్యారేజీని పునరుద్ధరించవచ్చు. వానకాలం మొత్తం గేట్లు తెరిచి ఉంచినా వరద తగ్గుముఖం పట్టాక గేట్లు దించి ప్రయోగాత్మకంగా నీటిని నిల్వ చేస్తూ బ్యారేజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవచ్చు. 2019 నుంచి 2023 వరకు ప్రతి యాసంగిలో ఇచ్చినట్టే వంద నుంచి 110 రోజులు ఎల్ఎండీకి దిగువన కాకతీయ కాల్వకు నిరంతరాయంగా నీళ్లు ఇవ్వొచ్చు. ఆ నీళ్లు సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ వరకు డోర్నకల్‌ను దాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా పంటలకు ఇచ్చి రైతులను ఆదుకోవచ్చు. రైతుల బతుకులు పచ్చబడటం కాంగ్రెస్, బీజేపీలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ మాత్రం ఇష్టం లేదు. అందుకే మేడిగడ్డ బ్యారేజీకి రిపేర్లు చేయకుండా అడ్డుపడుతున్నాయి. నిరుడు, ఈ యేడు యాసంగి సీజన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజీ-1, స్టేజీ-2 కలిపి 5 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు ఎండిపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. ఈ యాసంగిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగునీటి విడుదలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ అంటూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. ప్రభుత్వ ప్రకటనలు నమ్మి రైతులు పెద్ద ఎత్తున పంటలు సాగు చేశారు. ఫలితం వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరుసగా రెండేండ్లు యాసంగి సీజన్‌లో లక్షలాది ఎకరాల్లో రైతులు పంటలు కోల్పోయారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు ఇవ్వకపోవడమే అందుకు కారణం అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలుసు. అయినా వాళ్లకు రాజకీయాలే ముఖ్యం. లక్షలాది మంది రైతుల కష్టాలు ఏ మాత్రం పట్టవు. వాళ్ల రాజకీయ కక్షకు తెలంగాణ రైతన్నలు సమిధలవడమే విషాదం.

మేడిగడ్డ బ్యారేజీకి పూర్తిస్థాయిలో మరమ్మతులు సాధ్యమేనని దానిలో లోపాలు వెలుగు చూసినప్పుడే నిర్ణయానికి వచ్చారు. దెబ్బతిన్న ఏడో బ్లాక్‌లోని పిల్లర్లను పూర్తిగా తొలగించాల్సి రావొచ్చని.. ఆ ఒక్క బ్లాక్‌ను తిరిగి నిర్మిస్తే బ్యారేజీ పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం ఉన్నదని నిర్ధారించారు. రైతులకు నీళ్లు ఇవ్వాలనే సంకల్పం ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడో ఆ పనిచేసేది. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి రైతుల ప్రయోజనాల కన్నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం. అందుకే ఎన్‌డీఎస్‌ఏను అడ్డం పెట్టుకొని ఫక్తు రాజకీయాలు చేస్తున్నాయి. వరుసగా మూడో ఏడాది రైతుల పంటలను ఎండబెట్టడానికి కుట్రలు చేస్తున్నాయి. ఇప్పటికీ మించిపోయింది లేదు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికను వేగంగా తెప్పించి ఏడో బ్లాక్ పునరుద్ధరణ పనులు చేపట్టాలె. వచ్చే యాసంగి సీజన్‌లోనైనా రైతులు నష్టోకుండా ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలె. లేకుంటే కాంగ్రెస్, బీజేపీ రైతు వ్యతిరేకులుగా మిగిలిపోవడం ఖాయం. ఇప్పుడు ఆ రెండు పార్టీలు తేల్చుకోవలసింది వారికి రాజకీయాలు ముఖ్యమా? లేక రైతుల ప్రయోజనాలు ముఖ్యమా? అన్నది. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే సాధించే అద్భుతాలు ఏమిటో మన రైతుల కండ్ల ముందే ఉన్నాయి. వాటిని విస్మరిస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్న విషయం గుర్తించాల్సింది పాలకులే.

**(వ్యాసకర్త: శాసనమండలి సభ్యురాలు)**

# దుష్టపాలనను అంతం చేసే సభ

**సామూహికంగా ప్రతిధ్వనించిన 'జై తెలంగాణ' నినాదం ఓ అద్భుతమైన ప్రజాస్వామిక ఆకాంక్షను ఫలవంతం చేసింది. అణగారిన గుండెల్లో గూడు కట్టిన విషాదం కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ ఖడ్గంగా మారి బానిస సంకెళ్లను తెంచుకున్నది. స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా మహత్తర పోరాటాన్ని సుదీర్ఘంగా సాగించి చివరికి గమ్యాన్ని ముద్దాడిన చరిత్ర కేసీఆర్ సొంతం. ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేదాకా మడమ తిప్పని మొండితనం కేసీఆర్‌ది.**



ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించే ఎత్తుగడలు, ప్రత్యర్థులను కూడా మెప్పించగల నేర్పరితనం ఆయన సొంతం. లక్ష్యానికి అడ్డుగా ఉన్న వారిని తరిమికొట్టారు. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తి కేసీఆర్. ప్రజలకు కేసీఆర్‌పై విశ్వాసం ఉన్నది. కేసీఆర్‌కు ప్రజలపై నమ్మకం ఉన్నది. అందుకే, అరువై ఏండ్ల కల అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ ఇప్పుడు పాతికేండ్ల ప్రాయంలోకి అడుగుపెడుతూ రజతోత్సవ సంబురాలకు సన్నాహమైంది. ఈ నెల 27న వరంగల్‌లో జరుపుకొంటున్న బీఆర్ఎస్ రజతోత్సవం 'ఆర్మూర్ సభ పంతం-ఆంధ్ర పాలన అంతం' నినాదంతో చేసిన గర్జనను గుర్తుచేస్తున్నది. అంతేకాదు, ఉద్యమ చివరి దశలో 'తెలంగాణ వస్తే జైత్రయాత్ర.. లేదంటే శవయాత్ర' అని సింహంలా గర్జించిన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షను యాది చేస్తున్నది. అరవై ఏండ్ల కల స్వరాష్ట్రాన్ని సాధించిన మహత్తర ఘట్టం, పదేండ్ల కేసీఆర్ పాలనాదక్షత వరకు ఈ పాతికేండ్లలో ఎన్నో వెలుగూ చీకటి, ఆటుపోట్లు కోణాలు దాగి ఉన్నాయి. ఉమ్మడి పాలకుల దాడులు, కుట్రలు కుయుక్తులు, పార్టీని చీల్చాలని ఆంధ్ర పాలకుల వెన్నుపోటు రాజకీయాలు, కేసీఆర్‌ను లక్ష్యం చేస్తూ దుష్ప్రచారం, భరించలేని నిందలు, జాతీయ పార్టీలు అదే పనిగా చేసిన మోసాలు, బీఆర్ఎస్‌ను కిందా మీద చేసిన ఆర్థిక ఇబ్బందుల వంటి చిక్కులు అన్నీ ఇన్నీ కావు.

అది, 2001.. ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచినవారంతా పేద వర్గాలకు చెందిన వారు, వామపక్ష భావజాలం ఉన్నవారు. కానీ, ఏ ధనవంతుడూ బీఆర్ఎస్‌కు అండగా నిలవలేదు. ఒకానొక సమయంలో పార్టీ సభలు పెట్టడానికి కూడా ఒక దశలో నయా పైసలేని పరిస్థితులు. ఇదే సమయంలో ఉమ్మడి పాలకుల ఛీంకారాలకు భయపడి బీఆర్ఎస్‌కు అండగా నిలిచేవారు కరువయ్యారు. ఈ దశలో 2002 ఫిబ్రవరిలో హైదరాబాద్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ ఓడిపోయి పార్టీ పరిస్థితి మరింత చిన్నాభిన్నమైంది. ప్రథమ వార్షికోత్సవం జరపాలంటే కూడా ఏ మాత్రం సహకరించని ఆర్థిక పరిస్థితి. అయితే ఎలాంటి ఆర్థిక, రాజకీయ వనరులు లేకపోయినా వెనుకడుగు వేయని కేసీఆర్‌కు ప్రజాస్పందనే పెట్టుబడి అయింది. ప్రజా మద్దతునే ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. కేసీఆర్ ఇచ్చిన ఏ పిలుపుకైనా ప్రజలు తండోపతండాలుగా కదిలివచ్చారు. ఇలా ఏ సభకైనా లక్షల మంది హాజరయ్యారంటే ప్రజల గుండెల్లో ఆయనకున్న అభిమానం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ప్లీనరీ బహిరంగ సభ విజయం వెనుక కేసీఆర్ పడ్డ కఠోర శ్రమ, కష్టం మాటల్లో చెప్పలేం. వరంగల్ జైత్రయాత్ర పేరుతో 2003లో జరిగిన పార్టీ ద్వితీయ వార్షికోత్సవ సభకు యోధాను యోధులైన పలువురు జాతీయ నాయకులు రావడం ఆ సభ ప్రత్యేకత. ఒక్క మాటలో చెప్పాలంటే ఏటా జరిగే ప్లీనరీలు, బహిరంగ సభలను కేసీఆర్ బీఆర్ఎస్‌కు ఆయువుపట్టుగా భావించేవారు. ఆ ఏడాదిలో చేసిన కార్యక్రమాలను, తదుపరి ఏడాదిలో చేయబోయే కార్యక్రమాలను ప్రజలకు విడమర్చి చెప్పడానికి పార్టీ వార్షికోత్సవ బహిరంగ సభలను ఆయన సరైన వేదికగా భావిస్తారు. అందుకే ఆయన ఏటా పార్టీ వార్షికోత్సవ సభ నిర్వహణపై ఎక్కువ దృష్టి సారిస్తారు. అందులో భాగంగానే వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ఏర్పాట్లపైనా కేసీఆర్ పూర్తిస్థాయిలో దృష్టిసారించారు. ప్రతిష్టాత్మకంగా చేస్తున్న ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

వరంగల్ సభ కేసీఆర్ ప్రభుత్వ హయాం లో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరోసారి ప్రజలకు గుర్తుచేయనున్నది. అదే సమయంలో గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించడానికి జాతీయపార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు పన్నిన కుట్రలు, కుతంత్రాలనూ ఎండగట్టనున్నది. చివరగా నేనో విషయాన్ని ప్రస్తావించదలచుకున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీఆర్ఎస్ ఆవిర్భావ చివరి సభ నా నియోజకవర్గమైన ఆర్మూర్‌లో జరిగింది. ఆ సందర్భంగా అన్ని గోడల మీద 'ఆర్మూర్ సభ పంతం- తెలంగాణ సొంతం- ఆంధ్రా పాలన అంతం' అనే నినాదాన్ని ప్రముఖంగా రాశాం. ఆ మరుసటి ఏడాదే ఆంధ్రా పాలన అంతమై తెలంగాణ కల సాకారమైంది. అదేవిధంగా వరంగల్ సభ కూడా 'కాంగ్రెస్ దుష్ట పాలన అంతం' చేయాలనే సందేశం ఇస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**(వ్యాసకర్త: ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే)**

# రజతోత్సవం.. విజయోత్సవం



లక్ష్మణ్ మురారిశెట్టి
90119 66666

**జననమే తప్ప మరణం లేనిది, ఆరంభమే తప్ప అంతం లేనిది, సాగడమే తప్ప ఆగడం తెలియనిది దైవత్వం మాత్రమే. అంతటి దైవత్వం కలిగిన నేల మన తెలంగాణ. త్రిలింగ దేశంగా... శాతవాహన, కాకతీయ, గోలకొండ సామ్రాజ్య వైభవాల సీమగా... కృష్ణా, గోదావరుల పవిత్ర ధారగా, సాయుధ పోరాటం మొదలు అహింసా ఉద్యమం దాకా, 1969 అస్తిత్వ నినాదం మొదలు 2014 గమ్యం ముద్దాడేదాకా వెన్నుచూపని ధీరోదాత్తుల మేలు కలయిక తెలంగాణ. ఎప్పుడు అరాచక శక్తులు తమ కుట్రలతో అధర్మాన్ని ఆచరించినా ఇక్కడ తిరగబడే తత్త్వం ప్రతిఘటిస్తుంది. ఇది చరిత్ర పొడవునా తెలంగాణ నేలపై ఆనవాళ్లయి మనకు కనిపిస్తూనే ఉంటుంది. 1947న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొంది యావత్ భారతావని ఆనందడోలికల్లో ఊగుతుంటే తెలంగాణ సాయుధ పోరాటమై చెలరేగి 1952, మార్చి 6 వరకు తన తిరుగుబాటును చేస్తూనే ఉన్నది. అనంతరం భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో మనలను కబళించి మోసాలు చేస్తుంటే 1969 ఉద్యమమై ఎగిసి తెలంగాణ తెగువ ఏమిటో ప్రపంచానికి చాటింది.**

అదే పరంపరలో సమైక్య పాలకుల ఆగడాలతో ఆగమైపోతున్న సందర్భంలో, ఓవైపు పంటలు లేక, చేయడానికి పనిలేక, వలసల్లో తెలంగాణ సలసల మాడుతున్న సమయంలో అగ్నికి ఆజ్యం పోసినట్టు వలస పాలకులు కరెంటు చార్జీలను పెంచి, కాల్పులతో ముగ్గురిని పొట్టన పెట్టుకున్న 2000 దశకంలో ప్రజా నిరసనలు మిన్నంటాయి. దాని పర్యవసానమే 2001, ఏప్రిల్ 27న జలదృశ్యంలో ఆవిష్కృతమైన మహోన్నత ఘట్టం తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావం. ఆనాడే తన శాసనసభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవితో పాటు అన్నింటినీ వదిలేసి ఓ నవయువ పోరాటానికి నాందిగా బీజం వేస్తూ టీఆర్ఎస్ పార్టీని స్థాపించారు కేసీఆర్.

అది మొదలు తెలంగాణ చరిత్ర, తెలంగాణ రాష్ట్ర సమితి చరిత్ర రెండూ వేర్వేరు కావని ప్రపంచానికి చాటారు. పార్టీ ప్రారంభించిన రోజుల వ్యవధిలోనే 2001, మే 17న కరీంనగర్‌లో సింహగర్జన సభతో తెలంగాణ బలమేంటో ప్రపంచానికి చాటారు. ఆ తర్వాత వరుసగా జూన్ 1న పాలమూరులో, 2న నల్లగొండలో, 4న నిజామాబాద్‌లో, 5న నిర్మల్‌లో, 21న వరంగల్లులో అతి తక్కువ సమయంలోనే ఎవరికీ సాధ్యం కానివిధంగా భారీ సభలను నిర్వహించి తెలంగాణ భావజాల వ్యాప్తిని యావత్ రాష్ట్రం మొత్తం ప్రవహింపజేశారు కేసీఆర్. తన దీటైన మాటతీరు, అనర్గళ నిజాల వాగ్ధాటితో ప్రజలకు తెలంగాణ ఆవశ్యకత అర్థమైంది. దాని పర్యవసానమే పార్టీ పెట్టిన మూడు నెలల్లోనే స్థానిక సంస్థల్లో జయకేతనం ఎగురవేసి ఏకంగా నాలుగు జెడ్పీలను టీఆర్ఎస్ కైవసం చేసుకున్నది.


> **ఉద్యమంలో తుది అంకం ప్రారంభమైంది కేసీఆర్ నిరాహార దీక్షతోనే. అప్పటివరకూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, సమైక్యవాదుల కుట్రలను తట్టుకుంటూ, వలసవాదుల ఆర్థిక ఉన్మాదాలతో అణిచివేయాలని చేసిన పన్నాగాలను పసిగడుతూ నిరంతరం అప్రమత్తమై కేసీఆర్ చేసిన పోరాటం యావత్ ప్రపంచ చరిత్రలోనే అత్యున్నత పోరాటాల సరసన నిలుస్తుంది. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా వంటి యోధులకు ఏ మాత్రం తగ్గని స్థాయిలో అహింసాయుత పోరాటంతో తెలంగాణ బాపుగా మారారు కేసీఆర్.**

చివరికి ప్రాణార్పణకు సిద్ధమై సిద్దిపేట వేదికగా 2009 నవంబర్ 29న తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షకు కరీంనగర్ నుంచి బయల్దేరిన కేసీఆర్‌ను ఖమ్మం జైలుకు, నిమ్స్ ఆస్పత్రికి తరలించిన ఆ 11 రోజుల పాటు తెలంగాణ అగ్నిగుండమై ఎగిసింది. ఆ దీక్షా దివస్ స్ఫూర్తి నేటికీ, ఏనాటికీ కొనసాగుతూనే ఉంటుంది. దాని పర్యవసానమే డిసెంబర్ 9 ప్రకటన. అనంతరం డిసెంబర్ 23 విద్రోహ దినం రోజున సైతం ఎంతో సంయమనంతో యావత్ తెలంగాణను ఏకం చేసేలా కేసీఆర్ చాకచక్యంగా వ్యవహరించారు. 11 రోజుల నిరాహార దీక్ష అలసటను సైతం పక్కనపెట్టి జేఏసీ ఏర్పాటు మొదలు చరిత్ర కనీ వినీ ఎరుగని పోరాట రూపాలను ప్రపంచానికి పరిచయం చేశారు. మానవహారం, సాగరహారం, మిలియన్ మార్చ్, రైల్ రోకో, వంటా వార్పు, ఉస్మానియా, కేయూల గర్జన, మానుకోట ధిక్కారం, సకలజనుల సమ్మె వంటి చారిత్రాత్మక ఘట్టాలతో... ఉప ఎన్నికల ఫలితాలతో శ్రీకృష్ణ కమిటీ మధ్యే మార్గాలను పటాపంచలు చేస్తూ హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను దేశ యవనికపై 29వ రాష్ట్రంగా సుస్థిరం చేశారు కేసీఆర్. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అఖండ మెజారిటీ గెలుపుతో స్వపరిపాలనకు బీజం వేశారు కేసీఆర్. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పాలన ప్రారంభించిన కేసీఆర్ ఏ లక్ష్యాల కోసం తెలంగాణ తెగించి కొట్లాడిందో వాటన్నింటినీ ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వచ్చారు. చుక్క నీటి కోసం అల్లాడిన నేలపై కాళేశ్వర గంగను పరవళ్లెత్తించి కోటి ఎకరాలకు పైగా మాగాణాన్ని సృష్టించారు.



తెలంగాణే శ్వాసగా బతికే బాపు అధికారంలో ఉన్నన్నాళ్లు ఇక్కడ దోపిడీ చేయలేమని గ్రహించిన వలసవాద కుట్రలు పెచ్చరిల్లి, ప్రజల సహజ వ్యతిరేకతను రెచ్చగొట్టేలా చేసిన అబద్ధాల ప్రచారం, దాని పర్యవసానం నేడు తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్నారు. అధికారం కోసం కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు హామీలు నీటిమూటలయ్యాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే చెరసాలలు దిక్కవుతున్నాయి. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో నీటి ఊటలు తగ్గి, కరెంటు కోతలు పెరిగి అన్నదాత ఆగమవుతున్నాడు. ఉపాధి దొరుకక, బతుకుదెరువు లేక మళ్లీ వలస తెలంగాణమౌతుంది. అధర్మం విలయతాండవం చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే అధర్మం పెచ్చరిల్లినప్పుడు ధర్మ సంస్థాపన జరిగే తీరుతుంది. నేడు తెలంగాణలో సైతం రాబోయే రోజుల్లో అదే జరుగుతుంది. తెలంగాణ బాపు కేసీఆర్, తెలంగాణ ఆత్మ బీఆర్ఎస్. మళ్లీ మన కోసం తిరిగొస్తారు. సంక్షేమం, అభివృద్ధి కలబోతైన తెలంగాణగా తీర్చిదిద్దుతారు. జై కేసీఆర్, జై బీఆర్ఎస్. ఇలా టీఆర్ఎస్‌గా మొదలై బీఆర్ఎస్‌గా ప్రస్థానం కొనసాగిస్తున్నా... 25 ఏండ్లుగా తెలంగాణ కోసం పోరాడి తెలంగాణ సాధించి, అభివృద్ధి చేసి తెలంగాణను దేశంలోనే శిఖరాగ్రాన నిలిపి ఎన్నో విజయాలు అందించిన బీఆర్ఎస్ రజతోత్సవం, తెలంగాణకే విజయోత్సవం.

**(వ్యాసకర్త: బందూక్-చిత్ర దర్శకులు, సామాజికవేత్త)**






## రాజ్యాంగం అసలైన సుప్రీం!

**పార్లమెంట్‌కు చట్టం చేసే అధికారం ఉంది. అలాగే వాటిని రాజ్యాంగం ప్రకారం సమీక్షించి, పూర్తి న్యాయం చేసే బాధ్యత సుప్రీంకోర్టుపై ఉంది. చట్ట ప్రకారం.. పార్లమెంటో, కార్యనిర్వాహక వ్యవస్థో సుప్రీం కాదు. రాజ్యాంగమే అసలు సిసలు సుప్రీం.**

**- కపిల్ సిబల్, రాజ్యసభ సభ్యులు**

# గులాబీల జెండా పట్టి



రచన, గానం
**రసమయి బాలకిషన్**
మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే

పల్లవి: గులాబీల జెండాపట్టి మల్లేశో.. ఓహో..
గుండెకద్దుకొని రారా మల్లేశో మల్లేశా..
వరంగల్లు మహాసభకు మల్లేశో.. ఓహో...
ఊరువాడ కదిలేపోదాం మల్లేశా...




||చ||: కేసీఆర్ పోరుకు ఆయుధమే ఈ జెండా
పరాయి పాలనను పాతరవేసిన జెండా
అమరుల త్యాగాలకు హారతి పట్టిన జెండా
తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినదీ జెండా..
|| గులాబీల||

||చ|| రైతును రాజును చేసిన రైతుబంధు ఈ జెండా
సాగు తాగు నీరిచ్చిన కోటి ఎకరాల జెండా
కోట్లాది మందికి గుండె సప్పుడు ఈ జెండా
తెలంగాణ ఆత్మగౌరవం నిలిపినది ఈ జెండా
|| గులాబీల||

||చ|| సంటి బిడ్డలను సాదిన కేసీఆర్ కిట్టు జెండా
పేద బిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మి అయిన జెండా
ముసలవ్వలకు ఆసరైన చేతికర్ర ఈ జెండా
తెలంగాణ తల్లికే రూపమయిన జెండా
|| గులాబీల||

||చ|| తెచ్చుకున్న తెలంగాణ రక్షణయే ఈ జెండా
రేపటి మన బతుకులకు భరోసా ఈ జెండా
మల్ల తెలంగాణ ఎగిరేది గులాబీల జెండా
గులాబీల జెండా.. కేసీఆర్ మనకు అండా దండా...
|| గులాబీల||